విద్యార్థులకు మెరుగైన వైద్యం : కెఇ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలోని విద్యార్థులందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య చికిత్స చేయిస్తామని డిప్యూటీ సిఎం కెఇ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం కర్నూలులో సిఎం బాల సురక్ష మొబైల్ వాహనాలను కెఇ కృష్ణమూర్తి లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. 18 సంవత్సరాలలోపు పిల్లలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి వారి వివరాలను సిఎం డ్యాష్‌బోర్డుకు అందజేస్తారన్నారు. జిల్లాలో 44 మొబైల్ వాహనాలను పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా పర్యటన చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై రూ.47లు ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కెఇ ప్రభాకర్, ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

కాలువకు గండ్లు

అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం మైలాపురం వద్ద తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ఐదు చోట్ల గండ్లుపడ్డాయి. గండి పడిన చోట ఇసుక బస్తాలు అడ్డుగా వేస్తున్న స్థానికులు

హెచ్‌ఎల్‌సి గండి పూడ్చివేతకు చర్యలు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి, రాయదుర్గం

తుంగభద్ర ఎగువ ప్రధాన కాల్వకు పడిన గండ్ల పూడ్చివేత చర్యలు గురువారమూ కొనసాగుతున్నాయి. అనంతపురం జిల్లా బొమ్మనహళ్ మండలం మైలాపురం వద్ద బుధవారం తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ఐదు చోట్ల గండ్లుపడ్డాయి. నీరు పంటపొలాల్లోకి ప్రవహించి వరి, మిరపనార్లు నీట మునిగాయి. దీంతో తుంగభద్ర జలాశయం నుంచి దిగువకు విడుదల చేసిన నీళ్లను ఆపేశారు. కాలువలో వున్న నీటిని గండి పడిన ప్రదేశానికి ఎగువన వున్న నాగలాపురం వద్ద ఎస్కేప్ ఛానల్ ద్వారా వేదావతి నదిలోకి మళ్లించారు. కాలువలో నీటి ప్రవాహం తగ్గడంతో నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరమణరెడ్డి, డిఇఇ రామసంజన్న, ఎఇ రంజిత్‌కుమార్ దగ్గరగా వుండి గండి పూడ్చివేత చర్యలు చేపట్టారు. బస్తాలలోకి ఇసుకను నింపి గండి పడిన చోట కాలువకు అడ్డుగా కట్ట ఏర్పాటు చేశారు. నీటి ప్రవాహం పూర్తిగా ఆగాక కాలువకు గండి పడిన చోట 20 మీటర్ల మేర గట్టును పున్ననిర్మిస్తామని ఇఇ తెలిపారు. ఇందు కోసం జెసిబిలు, రోడ్డు రోలర్ తెప్పించామన్నారు. రెండు రోజుల్లో పూడ్చి వేత పనులు పూర్తి చేసి తిరిగి కాలువలోకి నీటి విడుదల చర్యలు తీసుకుంటామన్నారు. ఎగువ కాలువలోకి ఒకేసారి 1960 క్యూసెక్కుల నీరు వదలడం పలుచోట్ల కాలువలో ఎలుకలు, పందికొక్కులు బొరియలు పెట్టడంతో వాటి గుండా నీరు ప్రవేశించి నీటి ఉధృతికి రంధ్రాలు ఏర్పడినట్లు చెప్పారు. ప్రస్తుతం రంధ్రాలు పూడ్చి వేశామని అన్నారు. ఇంకా ఎక్కడైనా రంధ్రాలు ఉంటే వాటిని కూడా వెంటనే మరమ్మతు చేస్తామన్నారు. రాత్రిళ్లు కాలువపై గస్తి ఏర్పాటు చేసి గండ్లు పడకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తామని అన్నారు. డి.హీరేహాళ్ తహశీల్దారు ఖతిజున్ కుబ్రా, నాగలాపురం సర్పంచు తిమ్మన్న తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

పల్నాడులో అక్రమ మైనింగ్ కలకలం

- ఓబులాపురం తరహాలో తవ్వకాలు
- డిఫెన్సులో టిడిపి నేతలు
- వెంటాడుతున్న సిబిఐ భయం
- అధికారుల్లో మల్లగుల్లాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలో అక్రమ మైనింగ్ వ్యవహారం అధికారుల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. దేశ వ్యాప్తంగా సంచలనం కల్గించిన ఓబులాపురం మైనింగ్ కేసులో కర్నాటకకు చెందిన బిజెపి నాయకుడు గాలి జనార్ధన్ రెడ్డిపై నిత్యం ఆవినీతి ఆరోపణలు చేసే టిడిపి నాయకులే పల్నాడు ప్రాంతంలో అక్రమ మైనింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో పల్నాడులో సున్నపురాయి తవ్వకాలను నిలిపివేయగా టిడిపిప్రభుత్వం అధికారంలోకి రాగానే పునరుద్ధరించింది. ఆ పార్టీ నేతలు పల్నాడు ప్రాంతంలో పలు గ్రామాల్లో నిక్షిప్తమై ఉన్న సున్నపురాయిని తవ్వి అక్రమంగా రవాణా చేస్తున్నారు. గత మూడున్నరేళ్లుగా దాచేపల్లి, నడికుడి, కేశనుపల్లి, కోనంకి, కొండమోడు తదితర ప్రాంతాల్లో దాదాపు 40 లక్షల టన్నుల సున్నపురాయిని అక్రమంగా తవ్వి వివిధ ప్రాంతాలకు రవాణా చేసినట్లు తెలిసింది. పల్నాడులో టన్ను సగటు ధర రూ.800 వరకూ ఉంది. దీని ప్రకారం రూ.320 కోట్ల వరకూ అక్రమ వ్యాపారం జరిగింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు, రాయల్టీ, గతంలో అమ్మకం పన్ను, ఇప్పుడు జిఎస్‌టి మొత్తంగా ప్రభుత్వానికి భారీగా ఎగవేతకు పాల్పడినట్లు తెలిసింది. 2016 అక్టోబరులో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసే నాటికి రూ.293 కోట్ల ఎగవేతకు పాల్పడ్డారని పిటిషనర్ లోకాయిక్త, హైకోర్టు,కేంద్ర దర్యాప్తు సంస్థలకు పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై హైకోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా గత రెండేళ్లుగా అక్రమ మైనింగ్ కొనసాగించారు. అక్రమ మైనింగ్‌లో రాయల్టీ, ఫెనాల్టీ, జిఎస్‌టి తదితర పన్నులతోకలిపి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఆయన అనుచరుల నుంచి రికవరీచేయాలని పిటిషనర్ టిజివి కృష్ణారెడ్డి డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించి తగిన ఆధారాలతో హైకోర్టులో కూడా పిడుగురాళ్లకు చెందిన కె గురవాచారి, మాజీ ఎమ్మెల్సీ టిజివి కృష్ణారెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయడంతో హైకోర్టు ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించింది. ఇందుకు స్పందించిన హైకోర్టు అక్రమ మైనింగ్ వ్యవహారంలో హైకోర్టులో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు నోటీసులు జారీ చేసిన వ్యవహారం అధికార యంత్రాంగం, అధికార పార్టీల్లో తీవ్ర కలకలం ప్రారంభం అయింది. గత మూడున్నర ఏళ్లలో జరిగిన అక్రమ మైనింగ్‌పై నేషనల్ రిమోట్ ఏజెన్సీ ద్వారా తీసిన ఫోటో చిత్రాలను పిటిషనర్లు హైకోర్టుకు అందచేశారు. దీంతో ఈ కేసును హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ ఫోటోల ఆధారంగా సున్నపురాయి అక్రమ మైనింగ్ వల్ల సర్కార్‌కు ఏమేరకు నష్టం వచ్చిందో చెప్పాలన్న హైకోర్టు ఉత్తర్వుల్ని రాష్ట్ర ప్రభుత్వం ఖాతరు చేయలేదు. అప్పట్లో యరపతినేని అనుయాయులు గురవాచారిని తీవ్ర హింసకు గురిచేశారనే ఆరోపణలు వచ్చాయి. హైకోర్టు నోటీసుల నేపథ్యంలో గురువారం నుంచి పిడుగురాళ్ల, దాచేపల్లి మండలాల్లో సున్నపురాయి తవ్వకాలను నిలిపివేశారు. మరో వైపు హైకోర్టు సిబిఐ దర్యాప్తునకు ఆదేశిస్తుందోమోననే భయం టిడిపిలోనూ, ఇటు అధికారులను వెంటాడుతోంది.

జిల్లా అధికారుల మల్లగుల్లాలు

హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఎలా వ్యవహరించాలనే అంశంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లా కలెక్టర్ కోన శశిధర్ గురువారం తన చాంబర్‌లో మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సిబిఐ, కాగ్, కేంద్ర గనుల శాఖకు కూడా హైకోర్టు నోటీసులు జారీ చేసి సమాచారం కోరడంతో జిల్లా అధికారులు ఉలిక్కిపడ్డారు. ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ వ్యవహారాన్ని చాలా తేలికగా తీసుకుని సాదాసీదా నివేదికలతో సరిపెట్టారు. అయితే పిటిషనర్లు పక్కా ఆధారాలను హైకోర్టుకు అందచేయడంతో అధికార యంత్రాంగం డిఫెన్సులో పడింది. న్యాయ కోవిదుల సలహా తీసుకుని హైకోర్టుకు నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇప్పటి వరకూ జరిగిన అక్రమ మైనింగ్‌కు సంబంధించి పన్నులు, రాయల్టీ ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని రాబట్టాలని లేదంటే సిబిఐ విచారణకు ఆదేశించాల్సి వస్తుందని హైకోర్టు పేర్కొనడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

ఎంతమేరకు తవ్వకాలు జరిగాయి? ఎంత రాయల్టీ, సెస్సు, పెనాల్టీ, జిఎస్‌టి, ఇతర పన్నులు ఎలా వసూలు చేయాలి, ఎవరిని నుంచి వసూలు చేయాలనే అంశంపై తర్జన భర్జన పడుతున్నారు.

అక్రమ మైనింగ్‌పై పోరాటం కొనసాగిస్తాం: కృష్ణారెడ్డి

యంత్రాలతో సున్నపురాయి తవ్వకాలు కొనసాగిస్తూ ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల రాయల్టీ, పెనాల్టీ, ఇతర పన్నులు ఎగవేతకు పాల్పడిన టిడిపి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు వ్యవహారంలో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచిచూస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ టిజివి కృష్ణారెడ్డి తెలిపారు. మంత్రి నారా లోకేష్ అండదండలతోనే ఎమ్మెల్యే అక్రమ మైనింగ్‌కు పాల్పడినట్లు ప్రచారం జరుగుతుందని, అందువల్లే ఇప్పటివరకూ అధికారులు స్పందించలేదని అన్నారు.

సికిల్‌సెల్ ఎనిమియా విజృంభణ

- విశాఖ మన్యంలో 576 మంది విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ ఏజెన్సీని సికిల్‌సెల్ ఎనిమియా చుట్టుముట్టింది. ఇంతవరకు ఆంత్రాక్స్, మలేరియా, టైఫాయిడ్, డయేరియా, క్షయ, తాజాగా డెంగ్యూ వ్యాధులతో తల్లడిల్లిన గిరిజనం ఇప్పుడు సికిల్‌సెల్ ఎనిమియా, తలసేమియాతో తల్లడిల్లుతున్నారు. రాష్ట్రంలోని రంపచోడవరం ఐటిడిఎ తరువాత అత్యధిక కేసులు పాడేరు ఐటిడిఎ పరిధిలోని 11 మండలాల్లో నమోదు కావడంతో గిరిజనులు ఆందోళనకు గురవుతున్నారు. గతేడాది ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలురు, బాలికల పాఠశాలల్లో నిర్వహించిన వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో 576 సికిల్‌సెల్ ఎనిమియా కేసులు వెలుగుచూశాయి. ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి సికిల్‌సెల్, తలసేమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే వేల కేసులు బయటపడే అవకాశముంది. ఏజెన్సీలో ఏటా సికిల్‌సెల్, తలసేమియాతో చనిపోతున్నప్పటికీ అవేవీ అధికారిక గణాంకాల్లో లేకపోవడంతో ప్రాణాంతకమైన ఈ వ్యాధి పట్ల ప్రభుత్వం, దాని యంత్రాంగం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వ్యాధి వ్యాపిస్తూనేవుంది. అనువంశికంగా వచ్చిన సికిల్‌సెల్ ఎనిమియా కేసులు ఎన్నో సంవత్సరాల క్రితం బయటపడినా ఇంతవరకు రోగులను గుర్తించి ప్రత్యేక వైద్య, ఆహార సౌకర్యం, అవగాహన కల్పించే చర్యలు ప్రభుత్వం చేపట్టలేదు. ప్రాణాంతకమైన సికిల్‌సెల్ ఎనిమియా, సికిల్ తలసేమియా వ్యాధులకు శాశ్వత నివారణ లేకపోవడంతో రోగుల్లో అవగాహన పెంచడం ద్వారానే వ్యాధి తీవ్రతను తగ్గించగలమని వైద్య నిపుణులు చెబుతున్నారు. వ్యాధి నిరోధకశక్తి తగ్గకుండా అదనపు పోషకాహారం, శరీరంలో ఐరన్ స్థాయి తగ్గకుండా పోలిక్ యాసిడ్, విటమిన్-బి, సి ట్యాబ్లెట్లతోపాటు విటమిన్లు ఉండే ఆహారం రోగులకు అందించాల్సివుంది. సికిల్‌సెల్ ఎనిమియాతో బాధపడుతున్న 576 మంది విద్యార్థుల్లో 90 మంది విద్యార్థులు పదోతరగతి పూర్తికావడంతో ఆశ్రమ పాఠశాలల నుంచి బయటకొచ్చారు. ఇంకా రెండు నుంచి పదోతరగతి వరకు ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న బాల, బాలికలు 486 మంది ఉన్నారు. విశాఖ ఏజెన్సీలోని అరకు, అనంతగిరి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాల్లోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మూడు నుంచి పదోతరగతి చదువుతున్న 40,300 మంది బాల బాలికలకు 2017-18 విద్యాసంవత్సరంలో సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 14,073 మందికి సికిల్‌సెల్ వుందని అనుమానించి హెచ్‌బి-ఎస్ ఎలక్ట్రోఫోలోసిస్ పరీక్ష చేయడంతో 576 మందికి వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది. వీటిప్రకారం వందమంది అనుమానితుల్లో నలుగురికి సికిల్‌సెల్ ఉన్నట్లు బయటపడడంతో గిరిజనుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఏజెన్సీలో దాదాపు అన్ని గిరిజన తెగల్లో సికిల్‌సెల్ ఉన్నట్లు తేలింది. సికిల్‌సెల్ ఉన్న 576 మంది విద్యార్థుల్లో బాలురు 315, బాలికలు 261 మంది ఉన్నారు. 576 మంది విద్యార్థుల్లో 13 ఏళ్ల బాలికలు ముగ్గురు, 14 ఏళ్ల బాలురు ఇద్దరు సికిల్ తలసేమియాతో బాధపడుతున్నారు. తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికి సికిల్ సెల్ వుంటే వారి పిల్లలకుగానీ,



తరువాత తరం పిల్లలకుగానీ హెచ్‌బి-ఎస్ హెటిరోజైజోస్, తల్లిదండ్రులిద్దరికీ సికిల్‌సెల్ ఉంటే అత్యంత ప్రాణాంతకమైన హెచ్‌బి-ఎస్ హోమోజైజోస్ పిల్లలకు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంది. ప్రాణాంతకమైన హోమోజైజోస్‌తో 22 మంది విద్యార్థులు శారీరక ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీలో మండలాల వారీగా సికిల్‌సెల్ ఎనిమియాతో బాధపడుతున్న వారి వివరాలు **(రెండో బాగం రేపటి సంచికలో...)**

	మండలం	సికిల్‌సెల్ విద్యార్థులు
1.	జి.మాడుగుల	128
2.	పాడేరు	72
3.	కొయ్యూరు	83
4.	చింతపల్లి	29
5.	పెదబయలు	36
6.	ముంచంగిపుట్టు	56
7.	డుంబ్రిగుడ	19
8.	జికె వీధి	11
9.	హుకుంపేట	42
10.	అనంతగిరి	75
11.	అరకు	25
	మొత్తం	**576**

దేశ సార్వభౌమత్వం రిలయన్స్‌కు తాకట్టు

ఊమెన్ చాందీ విమర్శ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

దేశ సార్వభౌమత్వాన్ని బిజెపి సర్కారు రిలయన్స్‌కు తాకట్టు పెట్టిందని, యుద్ధ విమానాల కొనుగోలులో భారీ అవినీతి జరిగిందని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి ఊమెన్‌చాందీ విమర్శించారు. చిత్తూరు ఆర్ అండ్ బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చాందీ మాట్లాడుతూ యుద్ధ విమానాల నిర్వహణ ప్రతిష్టాత్మకమైన హెచ్‌ఎఎల్ సంస్థను కాదని, రిలయన్స్‌కు అప్పగించడం వెనుక ఉన్న ఆంతర్యాన్ని నరేంద్రమోడీ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. యుద్ధ విమానాల కొనుగోలులో భారీ అవినీతి చోటు చేసుకుందని, ఎలాంటి అనుభవం లేని సబ్బులు, పేస్టులు అమ్ముకునే రిలయన్స్ కంపెనీకి అప్పగించడం వెనుక నరేంద్రమోడీకి ఎన్నికల ఫండ్ కింద వేల కోట్ల రూపాయలు ముట్టాయని విమర్శించారు. జాతీయవాదం ముసుగు కప్పుకుని దేశ భద్రతను బిజెపి గాలికి వదిలేస్తోందన్నారు. యుద్ధ విమానాలను అధిక ధరలకు ఎందుకు కొనుగోలు చేశారో, హెచ్‌ఎఎల్ కంపెనీని ఎందుకు పక్కన పెట్టారో, నిబంధనలను పక్కన పెట్టి రిలయన్స్‌కు ఎందుకు అప్పగించారో సమాధానం చెప్పాలన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు రఘువీరారెడ్డి, మాజీమంత్రి శైలజానాథ్, డిసిసి అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విముక్తికి మతం సాధనం కాదు

- గోరా వర్ధంతిలో ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి
- ఆనరరీ ఫెలోషిప్ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

ప్రజల విముక్తికి మతం సాధనం కాదని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అన్నారు. ప్రజా విముక్తికి మానవత్వమే సాధనమన్నారు. సాంఘిక విప్లవకారులు, నాస్తికోద్యమ నిర్మాత గోరా 43వ వర్ధంతి గురువారం విజయవాడ నాస్తిక కేంద్రం ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా బెంజిసర్కిల్ సమీపంలోని నాస్తిక కేంద్రంలో 'ఆంధ్రప్రదేశ్‌లో సంఘ సంస్కరణ ఉద్యమాలు-ప్రాధాన్యత' అనే అంశంపై జరిగిన సదస్సులో రవి మాట్లాడారు. దోపిడీ సమాజం పోవాలంటే మానవ కేంద్ర సిద్ధాంతం అవసరమని అన్నారు. ఏ ఆశయమైనా సమాజంలో నిలబడాలంటే యువతను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో వైజ్ఞానిక విజ్ఞానాన్ని మతమౌఢ్యం మింగేసిందన్నారు. రాజ్యం, మతం వేర్వేరుగా ఉండాలన్నారు. సాంకేతిక మార్పు, సామాజిక పరిణామాలతో నూతన సంస్కరణలు తీసుకురావాలన్నారు. సంస్కరణల వ్యవస్థీకృత కేంద్రం నాస్తిక కేంద్రం అన్నారు. గోరా, సరస్వతి గోరాల స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అభ్యుదయవాదులపై ఉందన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ విజయం మాట్లాడుతూ డాక్టర్ సమరం నాస్తిక కేంద్రం చేస్తున్న సామాజిక కార్యక్రమాలను వివరించారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఉష మాట్లాడుతూ శ్రామిక మహిళల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోందని, దానికి గల కారణాలను

కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి, వేదికపై చెన్నుపాటి విద్య, డాక్టర్ సమరం తదితరులు

పరిశీలించాలని కోరారు. మహిళలకు విజ్ఞానాన్ని దూరం చేసే కుట్ర జరుగుతోందన్నారు. మాజీ పార్లమెంటు సభ్యులు చెన్నుపాటి విద్య మాట్లాడుతూ మతం, కులం అవకాశవాద రాజకీయాలకు అనుకూలంగా మారాయని ఆందోళన వ్యక్తంచేశారు.

ఆనరరీ ఫెలోషిప్ అవార్డుల ప్రదానం

ఈ సందర్భంగా నాస్తికత్వంపై విస్తృత పరిశోధన జరిపిన ఒరిస్సా రేషనలిస్ట్ అధ్యక్షులు ప్రొఫెసర్ ధనేశ్వర్ సాహు, సరస్వతీ గోరాపై పరిశోధన చేసి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ అందుకున్న డాక్టర్ విప్లవకుమారిలకు 'గోరా-సరస్వతి గోరా ఇంటర్నేషనల్ ఎథీస్ట్ రీసర్చ్ సెంటర్' ద్వారా ఆనరరీ ఫెలోషిప్ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం 'మూఢ నమ్మకాలు - నిర్మూలన' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీస్రవంతి అధ్యక్షులు వొరప్రసాద్, జి.నియంత, డాక్టర్ జి.మారు తదితరులు పాల్గొన్నారు. గోరా 43వ వర్ధంతిని పుర్కరించుకుని నాస్తిక సిద్ధాంతాల ప్రచార ఉద్యమంలోని అంశాలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆలోచింపజేసింది.

రైతుల త్యాగాన్ని అవమానిస్తున్న పవన్

మంత్రి నక్కా ఆనందబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులను అవమానించేలా జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తీరు ఉందని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 98 శాతం రైతులు ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారని తెలిపారు. రాజధానిలో అత్యంత వేగంగా అభివృద్ధి జరుగుతోందని అన్నారు. దేశం మొత్తం గర్వించేలా అంబేద్కర్ విగ్రహాన్ని త్వరలో నెలకొల్పడం జరుగుతుందన్నారు. రాజకీయ ప్రయోజనాలను ఆశించి పవన్ దీక్ష చేస్తున్నారని అన్నారు.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence
Registered Office: Plot No.21, Jawaharlal Nehru Pharma City, Parawada, Visakhapatnam - 531 021, Andhra Pradesh, India.
Corporate Office: 2nd Floor, Serene Chambers, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034, Telangana, India.
Contact Numbers: Tel: +91 40 3980 4333; Fax: +91 40 3980 4320
E-mail: secretarial@lauruslabs.com; Website: www.lauruslabs.com
Corporate Identity Number: L24239AP2005PLC047518

NOTICE

Notice is hereby given, pursuant to Regulation 29 of SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015, that a meeting of the Board of Directors of the Company will be held on Friday, August 03, 2018, inter-alia, to consider and approve the Unaudited Financial Results of the Company for the Quarter ended June 30, 2018.

By Order of the Board
For **Laurus Labs Limited**

Place: Hyderabad
Date: July 27, 2018
Sd/- **G.Venkateswar Reddy**
Company Secretary

బెల్ట్‌షాపులు తొలగించే వరకూ ఉద్యమించాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి - వినుకొండ

ఇళ్ల మధ్య ఉన్న బెల్ట్ షాపులు తొలగించే వరకూ ఐద్వా కార్యకర్తలు ఉద్యమించాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి పిలుపునిచ్చారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం గుంటూరు పశ్చిమ జిల్లా ప్రథమ మహాసభ వినుకొండలోని జాషువా కళా ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. తొలుత ఐద్వా జెండాను జిల్లా కార్యదర్శి ఎం.రమాదేవి ఆవిష్కరించారు. ఎస్‌కె రంజాన్‌బీ అధ్యక్షత వహించిన సభలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడారు. ఐద్వా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మద్యంపై యుద్ధం ప్రకటించి రాష్ట్ర జాతా నిర్వహించాలన్నారు. ఇళ్ల మధ్య ఉన్న బెల్ట్ షాపులు తొలగించే వరకు పోరాటం చేసి విజయం సాధించాలని కోరారు. చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని ఐద్వా నిరంతరం పోరాడుతుందన్నారు. నాలుగేళ్లలో బిజెపి, తెలుగుదేశం ప్రభుత్వ విధానాల కారణంగా మహిళలు, చిన్నారులపై నిత్యం అత్యాచారాలు, దాడులు నిత్యకృత్యమవుతున్నాయన్నారు. ఉపాధి పనులను పట్టణాల్లో అమలు చేయాలని, కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రసంగిస్తున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

అనంతరం రైతు సంఘం, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ, సిఐటియు నాయకులు మాట్లాడారు.

రికార్డింగ్ డ్యాన్సు అడ్డుకున్నందుకు పోలీసులపై దాడి

ప్రజాశక్తి - కావలి

రికార్డింగ్ డ్యాన్స్‌ను ఆపేందుకు వెళ్లిన ఎస్ఐ, పోలీసులపై దాడి చేయడంతో ఎస్ఐతో పాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి రూరల్ మండలం కొత్త సత్రంలో బుధవారం రాత్రి జరిగిన ఈ ఉదంతానికి సంబంధించి పోలీసుల కథనం ఇలా ఉంది. కొత్త సత్రంలో అశ్లీలమైన రికార్డు డ్యాన్సు నిర్వహిస్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో కావలి రూరల్ ఎస్ఐ పుల్లారావు, కానిస్టేబుల్ క్రిష్ణయ్య, ఇద్దరు హోంగార్డులతో హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లారు. గ్రామంలో రికార్డు డ్యాన్సును అడ్డుకోబోయారు. దీంతో పోలీసులపై దాడి జరిగింది. తీవ్ర గాయాలతో పోలీసులు పట్టణానికి చేరుకున్నారు. హోమ్‌గార్డు నాగరాజుకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఆయనను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. సిఐ అశోక్‌వర్ధన్‌ను వివరణ కోరగా రికార్డు డ్యాన్సును వేస్తున్నారని తెలిసి కొత్తసత్రం గ్రామానికి వెళ్లిన ఎస్ఐ పుల్లారావు, పోలీసులపై స్థానికులు దాడి చేసిన విషయం వాస్తవమేనన్నారు. గాయపడిన వారికి ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామన్నారు. ఎస్ఐ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటనకు కారకులైన వారిని త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.

పుస్తకాల ఆవిష్కరణ

నేడు గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో జరుగుతున్న రైతు సదస్సులో ప్రజాశక్తి బుక్‌హౌస్ ముద్రించిన పుస్తకాల ఆవిష్కరణ జరుగుతుంది

1. మహారాష్ట్రలో రైతుల మహాపాదయాత్ర ₹ 40/-
2. మార్కెట్ విషవలయంలో మన గ్రామ సీమలు ₹ 250/-

ప్రజాశక్తి బుక్‌హౌస్
డోరు నెం.27-1-54, కారల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ - 2
ఫోన్ : 0866 - 2577533, 9490098042.
బ్రాంచీలు :
విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం